క్లుప్తంగా

కొమరోలులో కేంద్ర బృందం తనిఖీ



కొమరోలు : పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

కొమరోలు: మండలంలోని కొమరోలు, ముక్తాపురం గ్రామాల్లో బుధవారం కేంద్ర బృందం పర్యటించింది. ఆయా గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ, గృహ నిర్మాణాలు, పంచాయతీరాజ్, వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై లబ్ధిదారులను ఆరా తీశారు. ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌ఎంఎల్ టీమ్ సభ్యులు ప్రభాకర్‌శర్మ, నందలాల్ గుల్జార్, ఏపీడీలు సుబ్బారావు, భాస్కర్‌రావు, లక్ష్మారెడ్డి, ఎంపీడీఓ చెన్నారావు, ఏపీఓ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓబులక్కపల్లిలో

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని ఓబులక్కపల్లిలో గురువారం కేంద్ర బృందం పర్యటిస్తుందని ఎంపీడీఓ శోభన్‌బాబు తెలిపారు. ఓబులక్కపల్లిలో పింఛనుదారులు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులతో మాట్లాడటంతో పాటు భూసర్వే రికార్డులు, సీసీ రోడ్లను పరిశీలిస్తారని పేర్కొన్నారు. 25న ఆముదాలపల్లిలో, 26న మూగచింతలలో కేంద్ర బృందం పర్యటిస్తుందని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్య బోధన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ గిరిధరశర్మ

రాచర్ల: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని ఎంఈఓ వారణాసి గిరిధరశర్మ సూచించారు. మండలంలోని సత్యవోలు, కాలువపల్లె గ్రామాల్లో ఎంపీయూపీ స్కూళ్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్య అవసరమన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని స్పష్టం చేశారు.

గిద్దలూరు హైస్కూల్లో డీవైఈఓ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను మార్కాపురం డీవైఈఓ ఎం.శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. 1981లో ఓ విద్యార్థి ఆ పాఠశాలలో చదివాడా లేదా అనే ఫిర్యాదుపై విచారణ చేపట్టి పాత రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. ఆయన వెంట ఎంఈఓలు కావడి వెంకటేశ్వర్లు, నాగభూషణ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వరశర్మ ఉన్నారు.

రైతులకు కంది విత్తనాలు పంపిణీ



కంది విత్తనాలు అందజేస్తున్న అధికారులు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని కుంచేపల్లిలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సాముహిక ప్రదర్శన క్షేత్రాలు పథకం కింద ఎల్‌ఆర్‌జీ-52 రకం కంది విత్తనాలను బుధవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌జీ-52 రకం 160-170 రోజుల్లో ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. ఎండ, తెగులును కొంత వరకు తట్టుకొని బాగా దిగుబడి వస్తుందని చెప్పారు. ఏవో దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కురిచేడు: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఆరోన్‌బాబు తెలిపారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు స్థానిక గురుకులంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 10వ తరగతిలో ప్రవేశానికి 9వ తరగతి 60 శాతం మార్కులతో పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు.

చిన్నపాటి వర్షానికే పట్టణాల్లో అంతర్గత రోడ్లు బురదమయం

రాకపోకల సమయంలో అవస్థలు పడుతున్న పుర ప్రజలు

పాలకులు స్పందించి రోడ్లు బాగు చేయాలని వినతి

పురవీధుల్లో ప్రయాణ సంకటం



మార్కాపురంలో రైల్వేస్టేషన్-రాయవరం రోడ్డు దుస్థితి (ఇన్‌సెట్‌లో) రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు



మార్కాపురం/గిద్దలూరు రూరల్: గ్రామాల్లో అంతర్గత రహదారులు, హైవేల నుంచి గ్రామాలను అనుసంధానం చేసే లింక్ రోడ్లు అధ్వానంగా తయారై జనం నానాఅవస్థలు పడుతున్నారు. పల్లె రోడ్లే దారుణంగా ఉన్నాయనుకుంటే పట్టణాల్లో అంతర్గత రహదారులు అంతకు మించి వాహనదారులకు చుక్కలు చూపుతున్నాయి. వర్షం కురిస్తే నీటితో నిండిపోయి బురదమయంగా మారుతున్న రోడ్లపై అడుగుతీసి అడుగేయడమే కష్టంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు ఎక్కడ అదుపుతప్పి పడిపోతామోనని ఆందోళన చెందుతూనే ముందుకు కదులుతున్న పరిస్థితి. రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాల్సిన పురపాలనాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. మార్కాపురం నుంచి రాయవరం మీదుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై గుంతల్లో నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

ఈ రహదారిపై రోజూ సుమారు 400కు పైగా ఆటోలు, 500కు పైగా ద్విచక్ర వాహనాలు, అలాగే ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని అంచనా. రోడ్డు దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న క్రమంలో పలువురు ద్విచక్ర వాహనదారులు గుంతల వద్ద అదుపుతప్పి పడిపోయి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని లేదంటే ధర్నా నిర్వహిస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

బురద రోడ్లతో బేజారు

గిద్దలూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల వైఎస్సార్ సీపీ కార్యాలయం వీధి, నల్లబండబజారు, అర్బన్ కాలనీ, శ్రీరామ్‌నగర్, రాజానగర్ రోడ్లు చిన్నపాటి వర్షానికే బురదమయం అవుతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో రోడ్లపై నీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ద్విచక్ర వాహనాలు బురదలో కూరుకుపోతుండటంతో అవస్థలు పడుతున్నారు. రాజానగర్ ముందు భాగంలో సీసీ రోడ్డు లోతట్టుగా ఉండటం వల్ల వర్షం నీరు డ్రెయినేజీలోఇకి వెళ్లేందుకు వీల్లేక అక్కడే నిల్వ ఉంటున్నాయి.

సుమారు వారం పది రోజుల వరకు వర్షం నీటిలో నుంచే ప్రజలు రాకపోకలు కొనసాగించాల్సిన పరిస్థితి. మున్సిపల్ అధికారులు స్పందించి అంతర్గత రహదారుకు మరమ్మతులు చేయాలని, ప్రయాణం సాఫీగా సాగేలా చూడాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గిద్దలూరు రాజానగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బురదమయమైన రహదారి



గిద్దలూరులో ప్రధాన రహదారి నుంచి వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వెళ్లే రోడ్డు పరిస్థితి ఇదీ..

దుకాణాల్లో విస్తృత తనిఖీలు



దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం టౌన్:

మార్కాపురం పట్టణంలోని ఎస్టేట్, ఏకలవ్య కాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో దుకాణాలను గురువారం పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. అక్రమ మద్యం, గంజాయి ఉందన్న సమాచారంతో టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు ఆధ్వర్యంలో బడ్డీ బంకులు, టీ హోటళ్లు, కూల్‌డ్రింక్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినా, గంజాయి కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు దుకాణాల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం: మార్కాపురం డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఎంపికైన డ్రైవర్లను ఆర్టీసీకి అవసరమైనప్పుడు పిలుస్తామని డీఎం తెలిపారు.

అనుచిత ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలి



బేస్తవారిపేటలో మాట్లాడుతున్న ఎస్సై రవీంద్రారెడ్డి



కంభం గురుకుల విద్యాలయంలో మాట్లాడుతున్న ఎస్సై నరసింహారావు

బేస్తవారిపేట: బాలికలు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే అడ్డు చెప్పాలని ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో గుడ్ టచ్-బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. స్నేహితులు, కుటుంబ సభ్యులు, అపరిచిత వ్యక్తులు అమర్యాదగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. మొబైల్ ఫోన్లకు అపరిచిత వ్యక్తులు పంపే వెబ్ లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు చెప్పకూడదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్లపై అనుకోకుండా ప్రమాదాలు జరిగినప్పుడు సహాయం అందించాలని, 108 లేదా పోలీసులకు సమాచారం అందించడం ద్వారా బాధితులకు సకాలంలో వైద్యం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కంభం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కంభం ఎస్సై నరసింహారావు సూచించారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బుధవారం విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువైన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చదువుకునే వయసులో చెడువ్యసనాలకు బానిసలైతే జీవితం నాశనమవుతుందన్నారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.

చదువుపై దృష్టి సారించాలి

పొదిలి: మాదక ద్రవ్యాల వాడకంతో జీవితాలు నాశనం అవుతాయని, విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం పొదిలి ఆల్ఫా స్కూల్లో ఎస్సై వేమనతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు: సోషల్ మీడియాతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని గిద్దలూరు రూరల్ సీఐ ఎ.రామకోటయ్య సూచించారు. కొమరోలులోని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో గుడ్ టచ్-బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. బాలికలు తమతో ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొమరోలు ఎస్సై జె.నాగరాజు, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్లకు వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

మార్కాపురం: మే నెలలో పదోన్నతి పొంది, బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతభత్యాలను ప్రభుత్వం 2 నెలల నుంచి చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వారికి వేతనం చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య డిమాండ్ చేశారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో బుధవారం మార్కాపురం మండలంలోని పలు గ్రామాల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు స్పాట్ వాల్యుయేషన్‌లో చెల్లించాల్సిన రెమ్యునరేషన్ కూడా ఇంత వరకు చెల్లించలేదన్నారు. ఉన్నత పాఠశాలల్లో రిలీవర్ లేక ఇబ్బందిపడుతున్న సబ్జెక్టు టీచర్లను పీఎస్ హెచ్‌ఎంలుగా ఉన్నవారిని తాత్కాలికంగానైనా డిప్యుటేషన్ వేసి పదో తరగతి విద్యార్థులకు బోధనలో ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. పాఠశాలల్లో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలు, మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు టి.వెంకటరమణ, ఎస్‌కే యూసఫ్, షరీఫ్, అల్లూరయ్య, అక్కల నారాయణ, కేటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఐక్యంగా పోరాడదాం



మాట్లాడుతున్న చర్మ, డప్పు కళాకారుల సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: చర్మ, డప్పు కళాకారులు తమ హక్కుల కోసం పోరాడాలని మాదిగ చర్మ డప్పు కళాకారుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి గూడూరి ఆనోజీరావు పేర్కొన్నారు. పట్టణంలోని చర్మకారుల సంఘం కార్యాలయంలో నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'హక్కుల కోసం భిక్షం ఎత్తకండి పోరాడే సాధించుకోండి' అంటూ బాబూ జగ్జీవన్‌రామ్ చెప్పిన సూక్తిని గుర్తు చేశారు. హక్కులు, సమస్యలపై ఐకమత్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం సంఘ నియోజకవర్గ అధ్యక్షుడిగా పందిటి రజినిబాబు, గిద్దలూరు మండల అధ్యక్షుడిగా గొట్టం నాగయ్య, రాచర్ల మండల అధ్యక్షుడిగా చిట్టెం భాస్కర్, అర్ధవీడు అధ్యక్షుడిగా దున్న యోబును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కోల ప్రసన్న, రెడ్డిపోగు గురవయ్య, కాలేబు, పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మానియేల్, సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ నేతలకు ఘన నివాళి



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కిట్స్ కళాశాల సిబ్బంది

మార్కాపురం టౌన్: స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్, బాల గంగాధర్ తిలక్ జయంతిని బుధవారం పట్టణంలోని కృష్ణచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకులను, వారు చేసిన త్యాగాలను గుర్తు చేశారు. చంద్రశేఖర్ ఆజాద్, బాల గంగాధర్ తిలక్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ రంగనాయకులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాట్లాడుతూ.. జాతీయ నాయకులను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పీఓ అనిల్ కుమార్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఘటాభిషేకం

త్రిపురాంతకం:

శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో ఘటాభిషేకం, శాకంబరి అలంకారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు పండితులు వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకం దేవస్థానంలో ఆషాడ మాసం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తజనులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలతో సారెను మంగళ వాయిద్యాలతో గ్రామం నుంచి తీసుకొచ్చారు. శ్రీపార్వతి దేవి అమ్మవారు ప్రత్యేకంగా శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామికి ఘటాభిషేకం భక్తులతో వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆశీర్వచనం అందించి అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆదిదేవునికి ఆరుద్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో మార్కండేశ్వరస్వామి

మార్కాపురం టౌన్: ఆదిదేవుడైన మహేశ్వరునికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా గురువారం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నాభిషేకం చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్‌శర్మ తదితరులు రుద్రాభిషేకం చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఈఓ చెన్నకేశవరెడ్డి పర్యవేక్షించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

మురుగు రోడ్డెక్కింది

కంభం: కంభం, కందులాపురం పంచాయతీ పరిధిలో డ్రైనేజీల నిర్మాణంలో భాగంగా వైజంక్షన్ సమీపంలో రోడ్డుకు ఒక వైపు నుంచి మరో వైపు మురుగు మళ్లించేందుకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. దీంతో ఆ మార్గంలో వాహనదారులు, పాదచారులతోపాటు దుకాణదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

● నీళ్లు వాసనొస్తున్నాయ్..



వాల్వ్ గుంతలో నిలిచిన మురుగునీరు

కంభం: మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంలో పలు ప్రాంతాల్లో వాల్వ్‌లు బురద, మురుగుతో నిండిపోవడం, పైప్‌లైన్ లీకేజీలతో కుళాయి నీరు దుర్వాసన వస్తున్నాయి. కంభంలోని సంజీవనగర్ కాలనీ సమీపంలో మురుగు నీట మునిగిపోయిన వాల్వ్‌ను తిప్పేందుకు పంచాయతీ కార్మికుడు వెతుక్కుంటున్న పరిస్థితి. ట్యాంకులు కూడా శుభ్రం చేయడం లేదని, పలు చోట్ల డ్రైనేజీల్లో ఉన్న పైపులకు లీకులు ఏర్పడటంతో కుళాయిల్లో మురుగు నీరు వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వాల్వ్ గుంతలు, ట్యాంకులను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.